సాక్షి
హైదరాబాద్‌, మంగళవారం, 2, జూలై, 2024

కనిపించే దైవాలు డాక్టర్లు


రక్తదానం చేస్తున్న గాంధీ సూపరింటెండెంట్‌ రాజారావు



డాక్టర్లను సత్కరిస్తున్న లష్కర్‌ జిల్లా సాధన సమితి ప్రతినిధులు


డాక్టర్‌ రవీందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సనత్‌నగర్‌: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీమాతా సేవా సమితి ఆధ్వర్యంలో బల్కంపేట రోడ్డులోని శంకర్‌ నేత్రాలయ కంటి ఆస్పత్రిలో జరిగిన వేడుకల్లో సరోజినీ దేవీ కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రవీందర్‌గౌడ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ కంటికి కనిపించే దైవాలుగా పలువురు అభివర్ణించారు. డాక్టర్‌ రవీందర్‌గౌడ్‌ మాట్లాడుతూ.. అంధత్వ నివారణ కోసం సనత్‌నగర్‌ నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవడం జరిగిందని, ఆ మేరకు అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. అంధత్వ నివారణే తన లక్ష్యమన్నారు. సమితి సభ్యులు మాట్లాడుతూ.. డాక్టర్‌ రవీందర్‌గౌడ్‌ 30 వేలకు పైగా ఉచిత కంటి ఆపరేషన్లు, లక్షకు పైగా ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమాతా సేవా సమితి అధ్యక్షురాలు కుసుమ విజయ, వసంత, కమల, కళాప్రియ, రాధిక పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో..

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మెడికల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్‌ రాజారావు నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 48, ఇతర ప్రాంతాల్లో 161 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు గాంధీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్స్‌ కృష్ణమోహన్‌, రవీందర్‌, డిప్యూటీ సూపరింటెండెంట్లు శ్రీహరి, వినయ్‌శేఖర్‌, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, గాంధీ బ్లడ్‌ బ్యాంకు ఇన్‌చార్జి సత్యరత్న పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ ఆసుపత్రిలో..

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండి డివిజన్‌ మధురానగర్‌లోని ఎస్‌ఆర్‌ ఆసుపత్రిలో సోమవారం లష్కర్‌ జిల్లా సాధన సమితి ప్రతినిధులు డాక్టర్స్‌ డే వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్‌ సంజీవరెడ్డితోపాటు ఆసుపత్రి వైద్యులను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో లష్కర్‌ సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌, ప్రతినిధులు మిట్టపల్లి బాబురావు, శ్రీకాంత్‌రెడ్డి, శైలేందర్‌, జంగయ్య, ఆనంద్‌, రవీందర్‌సాగర్‌, కృష్ణముదిరాజ్‌ పాల్గొన్నారు.

ఏసీపీకి కృతజ్ఞతలు


ఏసీపీ వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలుపుతున్న బస్తీ, కాలనీవాసులు

రసూల్‌పురా: బాలంరాయి కమాన్‌ నుంచి అన్నానగర్‌ చౌరస్తా వరకు అక్రమంగా పార్కింగ్‌ చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేటు ట్రావెల్స్‌ బస్సులు నిలపకుండా నార్త్‌జోన్‌ ఏసీపీ చర్యలు తీసుకోవడంతో పలు బస్తీ, కాలనీ వాసులు ఏసీపీ ఎస్‌. వెంకటేశ్వర్లును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఏసీపీని నార్త్‌జోన్‌ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గత కొన్నేళ్లుగా బస్సుల అక్రమ పార్కింగ్‌ కారణంగా ఇతరులు ఇక్కట్లకు గురవుతున్నట్లు సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో నగర సీపీ, నార్త్‌జోన్‌ ఏసీపీ ఆదేశాల మేరకు బేగంపేట లా అండ్‌ ఆర్డర్‌, మారేడుపల్లి ట్రాఫిక్‌ పోలీసులు చర్యలు తీసుకున్నారని స్థానికులు తెలిపారు. ఇకపై బస్సులు నిలపకుండా ఇనుప కమాన్‌ నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఏసీపీని కలిసిన వారిలో ఇటుక గోపి, గుండం రమేష్‌, వినోద్‌కుమార్‌ మధుసూదన్‌ రావు, మహేష్‌యాదవ్‌, మురళి గిరిదారి చిన్నా ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు వినతి

అడ్డగుట్ట: బోనాల పండుగ నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గాజుల హంసరాజు సోమవారం జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమీషనర్‌ రవి కిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అడ్డగుట్ట డివిజన్‌లోని అనేక ఆలయాల పరిసర ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలుగా మారి అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. రానున్న బోనాల పండుగను దృష్టిలో పెట్టుకొని సదరు రోడ్లకు తగిన మరమ్మతులు చేసి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఎల్‌. వెంకటస్వామి, పీ.లక్ష్మణ్‌, తదితరులు ఉన్నారు.

జపాన్‌ సదస్సుకు ఓయూ ప్రొఫెసర్లు


ప్రొ.రాజేష్‌ కుమార్‌


ప్రొ.లక్ష్మీకాంత్‌ రాథోడ్‌

ఉస్మానియా యూనివర్సిటీ: జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సు కు ఓయూ వ్యాయామ విద్య విభాగం (ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌) ప్రొ ఫెసర్లు రాజేష్‌ కుమార్‌, ఎల్బీ.లక్ష్మీకాంత్‌ రాథోడ్‌ హాజరుకానున్నా రు. ఈ నెల 5 నుంచి 8 వరకు జపాన్‌ రాజధాని టోక్యో నగరంలో నిగకుగ్యా యూనివర్సిటీలో జరిగే ఇంటర్నేషనల్‌ అలియన్స్‌ ఫర్‌ హెల్త్‌, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌, డాన్స్‌ అండ్‌ స్పోర్ట్స్‌ 2వ ప్రపంచ కాంగ్రెస్‌లో పాల్గొననున్నారు. మూడు రోజులు జరిగే అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి రిమాండ్‌


రాంగోపాల్‌పేట్‌: జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహన దొంగతనాలతో పాటు మొబైల్‌ ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరితో పాటు వాటిని కొనుగోలు చేసిన మరో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. గోపాలపురం ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌రెడ్డి వివరాల ప్రకారం.. మల్కాజ్‌గిరికి చెందిన స్టీవ్‌ జాసన్‌ (19), అదే ప్రాంతానికి చెందిన ఓ మైనర్‌ బాలుడితో కలిసి మొబైల్‌ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చారు. పాత జీవితానికి అలవాటు పడిన వారు వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేసి వాటిపై తిరుగుతూ మొబైల్‌ ఫోన్లు దొంగతనాలు చేసి మల్కాజ్‌గిరికి చెందిన వేముల సాయి సంతోష్‌ (19), జహీరాబాద్‌కు చెందిన ఉరుసు గణేష్‌ (19)కు విక్రయిస్తున్నారు. సోమవారం దొంగిలించిన వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న స్టీవ్‌ జాసన్‌తో పాటు మైనర్‌ బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం చెప్పాడు. నిందితుల నుంచి ద్విచక్ర వాహనాలు, మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకుని మైనర్‌ బాలుడిని జువైనల్‌ హోమ్‌కు ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి..


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జావెద్‌

సికింద్రాబాద్‌: విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌ మీదుగా ముంబైకి గంజాయిని రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని సికింద్రాబాద్‌ రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ డీఎస్పీ ఎస్‌ఎస్‌ జావెద్‌, జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ సాయీశ్వర్‌గౌడ్‌ కథనం ప్రకారం.. జీఆర్పీ బృందాలు సోమవారం సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ ప్లాట్‌ఫాం, రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న విశాఖ ఎక్స్‌ప్రెస్‌ రైలు జనరల్‌ బోగీలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన రెండు ట్రాలీ బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. బ్యాగులను విశాఖ ఎక్స్‌ప్రెస్‌ రైలులో నగరానికి తరలించిన ముంబయికి చెందిన అబుబాకర్‌ కసమ్‌ షేక్‌ (47)ను రిమాండ్‌కు తరలించారు.

చైన్‌ స్నాచర్లకు..


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

బౌద్ధనగర్‌: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన ఇద్దరిని వారాసిగూడ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ జైపాల్‌ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాణికేశ్వరీ నగర్‌కు చెందిన కొరుడల శ్రీనివాస్‌(48) కుంచపు పుల్లయ్య(62) జూన్‌ 27న వారాసిగూడ ఐక్యా ఇంటర్‌నేషనల్‌ స్కూల్‌ సమీపంలో తన ఇంటి గేటు వద్ద నిలబడి ఉన్న ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కున్నారు. ఈ పెనుగులాటలో సగం గొలుసు వృద్ధురాలి చేతిలో ఉండగా మిగిలిన సగం గొలుసుతో ఆ ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్‌ సైదులు, డీఎస్‌ఐ ప్రకాష్‌రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌ పాల్గొన్నారు.

ప్రత్యేక దర్శనం లైన్‌ ఏర్పాటు చేయాలి


ఈవోకు వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా దర్శనం కోసం వచ్చే వికలాంగులు, వయోవృద్ధులకు ప్రత్యేక క్యూలైన్‌ ఏర్పాటు చేయాలని రాయల సేవాసమితి ప్రతినిధులు ఆలయ అధికారులను కోరారు. సోమవారం దేవాలయ కార్య నిర్వాహణ అధికారి అంజనీదేవిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు ఆర్‌.సి.కుమార్‌ మాట్లాడుతూ.. వేడుకలను పురస్కరించుకుని వచ్చే లక్షలాది మంది భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సేవా కార్యక్రమాలు అందిస్తుంటారని తెలిపారు. ముఖ్యంగా వికలాంగులు, వయోవృద్ధులు దర్శనంకు వెళ్లే సమయంలో చేయుతనందిస్తారన్నారు. వినతి ఇచ్చిన వారిలో అప్పాజీ, ఆంజనేయులు, మధు ఉన్నారు.

పార్కుల్లో వసతులు ఏర్పాటు చేస్తాం


ఎమ్మెల్యే పద్మారావును కలిసిన షటిల్‌ క్రీడాకారులు

సికింద్రాబాద్‌: ప్రజలకు ఉపయుక్తంగా ఉండేవిధంగా పార్కుల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతామని సికింద్రాబాద్‌ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ హామీ ఇచ్చారు. చిలకలగూడ పార్కు షటిల్‌ క్రీడాకారులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి చిలకలగూడ పార్కు పరిస్థితులను వివరించారు. తమను పార్కులో షటిల్‌ ఆడకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని చెప్పారు. అదేవిధంగా చిలకలగూడ ఫ్రైడే మార్కెట్‌ సమీపంలో ఇండోర్‌ స్టేడియం నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. త్వరలో ఈ ప్రాంత క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నూతన నేర చట్టాలపై అవగాహన కల్పించాలి


ఎస్‌హెచ్‌ఓ కరుణాకర్‌రెడ్డితో బీజేపీ నేతలు

లాలాపేట: బ్రిటీష్‌ కాలం నాటి నేర చట్టాల స్థానంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేస్తున్న నూతన నేర చట్టాలతో నేరాల నియంత్రణతో పాటు బాధితులకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ ఎస్‌. వెంకటేష్‌గౌడ్‌ పేర్కొన్నారు. సోమవారం లాలాగూడ పోలీసు స్టేషన్‌ నూతన ఎస్‌హెచ్‌ఓ కరుణాకర్‌రెడ్డిని పలువురు బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన భారతీయ నేర చట్టాలపై ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్‌, శశి, రాము వర్మ, గోవర్ధన్‌ పాల్గొన్నారు.

మోతీలాల్‌ దీక్షకు మద్దతుగా విద్యార్థుల ర్యాలీ



ఉస్మానియా యూనివర్సిటీ: మోతీలాల్‌ ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా ఓయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్‌ కాలేజీ వరకు విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. సోమవారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఆందోళన చేట్టారు. గ్రూప్‌–1, 2, 3 ఉద్యోగాల సంఖ్య పెంపు, మెగా డీఎస్సీ, జాబ్‌ కేలండర్‌ విడుదల, రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని గాంధీ ఆసుపత్రిలో మోతీలాల్‌ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వినోద్‌ నాయక్‌, సతీష్‌ నాయక్‌, కార్తీక్‌ మహారాజ్‌, శివ మహారాజ్‌, లింగం తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను అరెస్టు చేసి బొల్లారం పీఎస్‌కు తరలించారు.

మాజీ సీఎం నాదెండ్లకు సన్మానం

సనత్‌నగర్‌: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు 90వ జన్మదినం పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవ రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. జూబ్లీహిల్స్‌లోని వారి ఇంటికి వెళ్లి భాస్కర్‌రావును శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పురురవరెడ్డి మాట్లాడుతూ.. నాదెండ్ల భాస్కర్‌రావుకు తమ కుటుంబంతో మంచి సంబంధాలు ఉన్నాయని, తాత మర్రి చెన్నారెడ్డి మొదలుకుని తమ వరకు ఆ సంబంధాలు అలాగే సాగుతున్నాయన్నారు.



రోగులకు పండ్ల పంపిణీ



గాంధీఆస్పత్రి : వైఎస్‌ఆర్‌సీపీ నేత, రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి పుట్టిన రోజు వేడుకలను సిద్దిపేట జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వరగుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్‌, బిస్కెట్లు పంపిణీ చేశారు.

నేడు ఎస్పీ కాలేజీలో నూతన భవనాల ప్రారంభం

పద్మారావునగర్‌: సికింద్రాబాద్‌ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన సర్దార్‌ పటేల్‌ కాలేజీ ప్రాంగణంలో నూతన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఈ నెల 2నమధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌ బాబు చేతుల మీదుగా ఆడిటోరియం, కామర్స్‌ బ్లాక్‌లను ప్రారంభిస్తున్నట్లు కాలేజీ చైర్మన్‌ డాక్టర్‌ ఎస్‌. రాజేందర్‌, కార్యదర్శి బి. సురేందర్‌ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: డీఎస్సీ పరీక్షను వాయిదా వేసి ఖాళీల సంఖ్యను పెంచాలని తెలంగాణ రీసెర్చ్‌ స్కాలర్స్‌ అధ్యక్షులు డాక్టర్‌ ప్రేమ్‌ కుమార్‌ సోమవారం పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో అనంతరం తొలిసారి వెలువడిన డీఎస్సీకి వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారని చదవడానికి సమయం సరిపోనందున పరీక్షను వాయిదా వేయాలన్నారు.

అక్షరాభ్యాస వేడుకలు



అమీర్‌పేట: అమీర్‌పేటలోని రవీంద్రభారతి ఎస్‌ఆర్‌నగర్‌ బ్రాంచి స్కూల్లో అక్షరాభ్యాస వేడుకలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్ర పఠనాల మధ్య చిన్నారుల చేత అక్షరాలను దిద్దించారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని స్కూల్‌ ప్రిన్సిపాల్‌ సరిత తెలిపారు.

బాలుడి అదృశ్యం


ఈశ్వర్‌

బౌద్ధనగర్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సుధాకర్‌ వివరాల ప్రకారం.. అంబర్‌నగర్‌ కట్టకు చెందిన ఈశ్వర్‌(14) ఓ ప్రైవేట్‌ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఎక్కువగా ఫోన్‌ చూస్తుండటంతో ఆదివారం ఈశ్వర్‌ను తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఈశ్వర్‌ ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లాలాగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో..

అడ్డగుట్ట: అతిగా సెల్‌ఫోన్‌ వాడొద్దని తల్లి మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైన సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం. లాలాపేటలోని జనప్రియ హెవెన్స్‌లోని ఓ ఫ్లాట్‌లో నివాసముంటున్న కుర్ర రోజా రాణి కుమార్తె సాయివాసవి (13) ఏడో తరగతి వరకు చదివి మానేసింది. ఇంట్లో ఉంటూ ఎక్కువగా సెల్‌ఫోన్‌ చూస్తుండటంతో తల్లి గట్టిగా మందలించడంతో సోమవారం సాయి వాసవి ఇంట్లో నుంచి రూ. 15 వేల నగదు తీసుకుని వెళ్లిపోయింది. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అడ్డగుట్ట: అప్పు తీర్చడానికి తల్లిదండ్రులు డబ్బులివ్వకపోవడంతో కొడుకు యాసిడ్‌ తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ ఆంజనేయులు వివరాల ప్రకారం.. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన నర్సింగ్‌(30) ఆటో డ్రైవర్‌. మద్యానికి బానిసైన ఇతను రూ. 3 లక్షల అప్పు చేశాడు. ఆ అప్పు తీర్చేందుకు గత నెల 19న తల్లిదండ్రులను డబ్బు అడిగాడు. వాళ్లు ససేమిరా అనడంతో బాత్రూమ్‌లోకి వెళ్లి యాసిడ్‌ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జనావాసాల్లోకి పాము

అడ్డగుట్ట: తుకారాంగేట్‌ బోయబస్తీ సమీపంలోని ఓ ఇంటి ముందుకు పాము రావడంతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు పెట్టారు. చెత్తా చెదారం పేరుకుపోవడంతో పాములు సంచరిస్తున్నాయని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ ఏతఃవేణు చెత్తా చెదారాన్ని తొలగించేల చర్యలు తీసుకుంటామన్నారు.

రైల్వే సహకార సంఘం రుణ పరిమితి పెంపు


వాటాదారులకు కొత్త రుణాలు అందజేస్తున్న దృశ్యం

సికింద్రాబాద్‌: దక్షిణమధ్యరైల్వే సహకార పరపతి సంఘం ద్వారా వాటాదారులకు కనీస రుణ పరిమితిని పెంచినట్లు సంఘం అధ్యక్షుడు చిలుకు స్వామి తెలిపారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వాటాదారులకు పెంచిన రుణాలను అందించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. వాటాదారులకు ఆర్థిక పరమైన చేయూతను అందించడం కోసం రుణ పరిమితిని పెంచుతూ సంఘం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రత్యేక రుణ పరిమితిని రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు, సాధారణ రుణ పరిమితిని రూ.80 వేల నుంచి రూ.3 లక్షల వరకు పెంచినట్లు వెల్లడించారు. రుణ పరిమితి పెంచడం ద్వారా సంఘంలోని 42 వేల మంది వాటాదారుల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి


ఆది శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛాన్ని అందచేస్తున్న ఓయూ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్‌ పాలనలోనే పేదల అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ పేర్కొన్నారు. సోమవారం ఓయూ జేఏసీ చైర్మన్‌ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో బీఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్‌, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డా.పెంట కృష్ణ ఆది శ్రీనివాస్‌ను అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ప్రభుత్వ పథకాల గురించి చర్చించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళల అభివృద్ధికి కాంగ్రెస్‌ పార్టీ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్‌ పేర్కొన్నట్లు వెల్లడించారు.

విటెన్‌బర్గ్‌ విశ్వవిద్యాలయంలో స్పాట్‌ అడ్మిషన్లు

అమీర్‌పేట: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు విటెన్‌బర్గ్‌ విశ్వవిద్యాలయం స్పాట్‌ అడ్మిషన్లు కల్పిస్తుంది. అమీర్‌పేట ఆదిత్యపార్క్‌ హోటల్‌లో 3వ తేదీన అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని యూనివర్సిటీ ఉపాధ్యక్షురాలు మారిబెర్త్‌ స్టీవెన్స్‌ వెల్లడించారు. ఒహాయోలోని స్ప్రింగ్‌ ఫీల్డ్‌ లాంటి డైనమిక్‌ మెట్రోపాలిటన్‌ ప్రాంతంలో గల యూనివర్సిటీలో మాస్టర్‌ సైన్స్‌ ఆఫ్‌ ఎనాలిటిక్స్‌ కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సైన్స్‌, ఇంజనీరింగ్‌ విద్యార్థులు సైతం ఈ కొత్త కోర్సుల్లో చేరవచ్చన్నారు. దీంతో పాటు యూనివర్సిటీలో మరిన్ని అత్యాధునిక కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఎనాలిటిక్స్‌, ఎంబీఏ లేదా ఎంఎస్‌బీఏ డిగ్రీలో అడ్వాన్స్‌ ఎంఎస్‌ ఉన్న నిపుణులకు మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థుల కోసం హైదరాబాద్‌ నగరంలోని యూనివర్సిటీ హబ్‌తో కలిసి స్పాట్‌ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దూద్‌బావి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి


ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్‌ దూద్‌బావిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తగిన మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించాలని సీపీఐ సికింద్రాబాద్‌ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్‌ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టికి వినతిపత్రాన్ని అందించారు. పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో చిన్నారి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పాఠశాల ప్రాంగణంలో అంగన్‌వాడీ సెంటర్‌ కొనసాగుతుందని, గర్భిణులు, చిన్నారులకు సరఫరా చేసేందుకు ఆహార పదార్థాలు వాహనాల్లో తరలించే అవకాశం లేదన్నారు. పాఠశాల తూర్పు వైపున ప్రధాన రహదారి ఉన్నప్పటికీ కాలనీవాసులు అడ్డుగా గోడ ఏర్పాటు చేయడంతో మార్గం మూసుకుపోయిందన్నారు. పాఠశాల గోడలు పెచ్చులూడి ప్రమాదకరంగా మారిందని, తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, గౌరీనాగరాజ్‌, గువ్వల మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎఫ్‌ఆర్‌డీలో శిక్షణ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని సీఎఫ్‌ఆర్‌డీలో వారం రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం రిజిస్ట్రార్‌ ప్రొ.లక్ష్మీనారాయణ ప్రారంభించారు. సైన్స్‌ పరిశోధనలో సాంకేతిక అంశాలపై వారం రోజులు జరిగే శిక్షణ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని రిజిస్ట్రార్‌ పేర్కొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



సనత్‌నగర్‌: తెలంగాణ పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు నూతన మెంబర్‌ సెక్రటరీగా నియమితులైన జీ రవి సోమవారం సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలు, నిధులు, కేంద్ర ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై మంత్రి సురేఖ సభ్యకార్యదర్శితో చర్చించారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



స్కూల్‌ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

లాలాపేట: విద్యాసంస్థల బస్సుల నిర్వాహకులు సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్‌ ఏసీపీ సంపత్‌కుమార్‌ అన్నారు. సోమవారం హబ్సిగూడ చౌరస్తాలో నల్లకుంట ట్రాఫిక్‌ పోలీసులు, ఆర్టీఏ అధికారాలు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ మార్గంలో వెళ్తున్న ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలల బస్సులను ఆపి తనిఖీ చేశారు. వాహనాల ఫిట్‌నెస్‌, డ్రైవర్‌ లైసెన్స్‌, ఫైర్‌ సేఫ్టీ, తదితర వాటిపై ఆరా తీశారు. రాకపోకల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ అవగాహన కల్పించారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తీసుకెళ్లరాదని సూచించారు. ఫస్ట్‌ ఎయిడ్‌ బాక్స్‌, ఫైర్‌ సేఫ్టీ లేని మూడు బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాంబాబు, ఎస్సై జయానంద్‌, ఏఎస్సై వెంకటేశ్వరావు, ఆర్టీఏ ఎస్సై రజియా, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు స్కూల్‌ బస్సుల సీజ్‌


సీజ్‌ చేసిన బస్సులతో ట్రాఫిక్‌, ఆర్టీఏ అధికారులు

రాంగోపాల్‌పేట్‌: సికింద్రాబాద్‌ ఎస్డీరోడ్‌లోని గీతాంజలీ పాఠశాలకు చెందిన రెండు బస్సులను ఆర్టీఏ అధికారులు సీజ్‌ చేశారు. సోమవారం ఉదయం తిరుమలగిరి ఇన్‌చార్జి ఆర్టీవో స్వామి, ఆర్టీవో ఎస్సై లావణ్య, ట్రాఫిక్‌ ఏసీపీ వెంకటేశ్వర్లు, గోపాలపురం ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకట రాములు, ఎస్సై సతీష్‌ గీతాంజలి స్కూల్‌ బస్సులను తనిఖీ చేయగా నంబర్‌ ప్లేటు సరిగా లేని ఒక బస్సు, స్కూలు బ్యాగులు పెట్టుకునేందుకు సరైన స్థలం లేని మరో బస్సును సీజ్‌ చేశారు.